



# పాఠకుల ఆలోచనా శక్తిని పెంచేదే కథ

**- డా. పరిమళా సోమేశ్వర్**

రచయిత్రుల స్వర్ణయుగం (1960-1980)లో సురభిళ సాహితీ కుసుమం శ్రీమతి పరిమళా సోమేశ్వర్. విద్యావతి, అధ్యాపకురాలు, రచయిత్రి, గృహిణి, రిసోర్ పర్సన్... బహుముఖీనంగా ప్రస్థానం కొనసాగిస్తున్న-ప్రత్యేకబాణి, వాణి, వ్యక్తిత్వం గల సాహితీ సృజన డా. ప మళా సోమేశ్వర్‌తో ఈ వారం ముఖాముఖి.



భర్త సోమేశ్వర్‌తో....

## పుట్టింటి గురించి

లక్కాప్రగడ వారి ఆడపడుచు అన్నపూర్ణ, పాటి బండ కేశవరావు మా అమ్మా నాన్నలు. వారికి మేం మొత్తం అరడజను మంది సంతానం. నాకు వెంకట్రామశర్మ, రామమోహన శర్మ ఇద్దరు అన్నయ్యలు. సుజాత, కాంచనలత అక్కయ్యలు. శ్రీదేవి చెల్లెలు. మా చిన్నన్నయ్య మోహన్‌కూడా మంచికవి. 1929 సెప్టెంబర్లో పుట్టి 1952 ఏప్రిల్‌కి మమ్మల్ని వదిలి వెళ్లిపోయాడు. బతికున్న ఆ కాసిని రోజుల్లోనే చాలా మంచి కవిత్వం రాశాడు. ''నా రచనలందు సతము నానా ముఖములు-ప్రజల జీవితచ్ఛాయలే ప్రతిఫలించు'' అన్న అతని కవిత్వ పంక్తులు ఎన్నటికీ మరపురానివి. మా నాన్న ఎక్కువగా చదువుకో లేదు. వ్యవసాయం చేసేవారు. కానీ తమ్ముడిని బాగా చదివించారు. ఆయనే పండితుడిగా, పరిశోధకుడిగా పేరు పడి, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఉన్నత పదవి నిర్వహించిన మా చిన్నాన్న పాటిబండ మాధవశర్మ. కృష్ణాజిల్లా తేలప్రోలు మాది. నేను 1942 ఆగస్టు 9వ తేదీన అక్కడే పుట్టాను. ఉమ్మడి కుటుంబం. బంధుమిత్రుల రాకపోకలు, అతిథి సత్కారాలు సందడిగా వుండేది. మా నాన్నగారి దేశభక్తి అభ్యుదయభావాలు నాకూ వంటబట్టాయి. నాన్నగారి సాంఘిక సేవా కార్యక్రమాలకు అమ్మ చేదోడు వాదోడుగా వుండేది. అమ్మ రాట్నంతో ఖద్దరు వడికేది.

## పెట్ స్టూడెంట్


స్కూల్ ఫైనల్ వరకు తేలప్రోలు, బి.ఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ) విజయవాడ ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీలో, ఎం.ఎస్సీ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని రేవాలో చదివాను. పిహెచ్‌డి హైదరాబాద్ ఉస్మానియాలో చేసి డాక్టరేట్ తీసుకున్నాను. చదువు, సాహిత్యం జంటగా సాగాయి. మా అన్నయ్యలు, చిన్నాన్నలు సాహితీవేత్తలు కావడంతో సృజన నా రక్తం లోనే వుందనిపిస్తుంది. నా హైస్కూల్ డేస్ నించీ సాహిత్యాభిలాష వుంది. తేలప్రోలులో బాబూ రాజేంద్రప్రసాద్ ప్రారంభించిన వేమన గ్రంథాలయంలో నేను చదవని పుస్తకం లేదు. ప్రతి సంవత్సరం స్కూల్ మ్యాగజైన్‌లో నా కథ వుండాల్సిందే! మా మాస్టారు రామచంద్రాచార్యులు గారు ఓసారి నేను రాసిన 'ఒక రోజు' అన్న కథని నా చేత మైక్‌లో చదివించారు. ఈనాటి 'పాప' మున్ముందు పెద్ద రచయిత్రి అయ్యే లక్షణాలు కనబడు తున్నాయని ఆశీర్వదించారు. 'పాప' నా కలం పేరు. అంటే పాటిబండ పరిమళ అన్నమాట. సభాముఖంగా ఆ మెప్పు చాలా గొప్పది. ఇంగ్లీష్‌లో కూడా మంచి ప్రొఫిషియన్సీ వుండేది. ఆస్కార్‌వైల్డ్, మిల్టన్, మామ్, పెరల్‌బక్, షేక్స్‌పియర్ రచనల్ని అభిమానంగా చదివేదాన్ని. పాఠ్యాంశాల్లో వాళ్ల రచనల గురించి కామెంట్ చేస్తుండేదాన్ని. నిజానికి అన్ని సబ్జక్టుల్లో మంచి మార్కులు వచ్చినా మా ఇంగ్లీష్ టీచర్లకి నేను పెట్ స్టూడెంట్‌ని.

## బొమ్మకి బహుమతి

అరుణ, భారతులు నా చిన్ననాటి స్నేహితులు. చదువులో అరుణతో పోటీవల్లే పదవ క్లాస్‌లో మార్కులు మొత్తంలో ప్రథమ శ్రేణి పొంది స్కూల్ రికార్డు బ్రేక్ చేశాను. నేను ఎనిమిదో తరగతిలో వున్నప్పుడు ఆంధ్రపత్రిక వాళ్లు దసరాకు 14 ఏళ్ల లోపు బాల బాలికలకు బొమ్మల పోటీపెట్టారు. ఓ అమ్మాయి కుర్చీలో కూర్చుని టేబుల్‌మీద దీపం బుడ్డి పెట్టుకుని, శ్రద్ధగా చదువుకుంటున్నట్టు వేసిన బొమ్మ సాధారణ ప్రచురణకి తీసుకున్నారు. అప్పుడు నాకు పన్నెండేళ్లు. తర్వాత కొన్నాళ్లు ఛందస్సుతో కుస్తీ... పద్యరచన ప్రహసనంగా మారాయి. దాంతో వ్యాసరచన, కథా రచన వైపు వచ్చేశాను. నేను, నా ఫ్రెండ్స్ చదివిన నవలలు, చూసిన సినిమాల గురించి విశ్లేషణాత్మకంగా డైరీల్లో రాసుకునే వాళ్లం. మా ముగ్గురిలో నా శైలే బాగుందని వాళ్లిద్దరూ మెచ్చుకునే వాళ్లు. వాళ్లే నా రచనలకి తొలి అభిమాన పాఠకులు. కవిత్వంతో సాహిత్య రచన ప్రారంభమైంది.

## కలం బలం

ఎం.ఎస్సీ అవగానే గవర్నమెంట్ సిటీ కాలేజీలో 1964లో కెమిస్ట్రీ లెక్చరర్‌గా చేరాను. ఉద్యోగంలో చేరగానే కెమిస్ట్రీలో లాబ్ బ్యాక్‌గ్రౌండ్‌తో 'మిస్ సుధారాణి' అని కథ రాశాను. అది యువ మంత్లీలో అచ్చయింది. పత్రికల్లో అచ్చయిన నా తొలి రచన అదే! ఆ తర్వాత 20 పైగా నవలలు, 20కు మించి కథలు, వ్యాసాలు, నాటికలు, నాటకాలు, కవితలు రాసినా నా పేరు చెప్పగానే అందరికీ ఠక్కున గుర్తొచ్చేది 'క్రోటన్ మొక్కలు' కథ. మేం చదువుకునే రోజుల్లో మా ఫ్రెండ్ వదినగారి మాటలు నన్ను ఆ చిన్న వయసులోనే చాలా డిస్టర్బ్ చేశాయి. మనసులో అలా వుండిపోయాయి. 1964లో ఉద్యోగం, '65లో పెళ్లి, '68 నాటికి ఇద్దరు పిల్లలు నాకు. అప్పుడు 'సరైన ప్లానింగ్, క్రమశిక్షణ వుంటే దేనికీ ఏదీ ప్రతిబంధకం కాదు' అన్నట్లు క్రోటన్ మొక్కలు రాశాను. భారతిలో వచ్చింది. ఆ కథకి చాలా పేరొచ్చింది. అలాగే నవలల్లో 'తెల్లకాకులు', 'పిల్లలతో ప్రేమయాత్ర', 'వలయం', 'యువతరం శివమెత్తితే' వంటివి ఎక్కువ పాపులర్. మార్చి 74 సంచిక ముఖచిత్రంగా నా ఫోటో వేసి 'వలయం' సీరియల్ ప్రారంభించారు తరుణ మాస పత్రిక వారు. 'స్త్రీ స్వాతంత్ర్యం, వ్యక్తిత్వం కోసం సాహిత్య పరంగా కృషి చేస్తున్న తెలుగు రచయిత్రులకు'



మేమిద్దరం... అప్పటికే మాకిద్దరు...

ఆ నవల అంకితం చేశాను. అప్పట్లో అదో కొత్తదనం.

## భర్తను లొంగదీసుకోవడం ఎలా?

తల్చుకుంటే చిత్రంగా అనిపిస్తుంది. 1968 ప్రాంతాల్లో రవీంద్రభారతి కళాభవన్‌లో మంచి సాహితీ చర్చా కార్యక్రమాలు జరిగేవి. ఆ సంవత్సరం లోనే చలం కథల చర్చకి వెళ్లాను. చలం వ్యతిరేకులైన వృద్ధులు, ఇష్టపడే కుర్రకారూ అంతా వున్నారు. ఆ రోజు చర్చల్లో పాల్గొన్న వాళ్లందరు చలాన్ని అడ్డు పెట్టుకుని ఒకరినొకరు యిష్టమొచ్చినట్లు విమర్శించుకున్నారు, తిట్టుకున్నారు, కొట్టుకున్నంత పనిచేశారు. నేను చలాన్ని సమర్థిస్తూ మాట్లాడాను. మునిమాణిక్యంగారు చలం రచనలనే గాక, నా అభిప్రాయాలను కూడా తీవ్రంగా ఖండించారు. ఆ క్షణంలో నాకాయన పరమ చాదస్తుడిలా కనిపించారు. ఆ తర్వాత నాలుగైదు రోజులకు ఆయన రచనలు చదివాను. ఆయన పట్ల గౌరవం కలిగింది. ఆయనే 'భార్యను లొంగదీసుకోవడం ఎలా' అన్న పుస్తకాన్ని రాసి బోయి భీమన్నగారికి అంకితం ఇచ్చిన సభకు వెళ్లాను. ఆ సభకి ఆహ్వాన పత్రికతో బాటు పంపిన ఆ పుస్తకం చదివి మరీ వెళ్లాను. ''నేను మీరు రాసినట్లే'' 'భర్తను లొంగదీసుకోండం ఎలా?' అన్న బుక్ రాసి మీకే అంకితం ఇస్తానన్నాను. ఆయన నవ్వి 'అలాగే తప్పకుండా రాయమ్మా' అన్నారు. మాట ప్రకారం నెల రోజుల్లో ఆ వ్యాసాలు రాసి ఆంధ్ర సచిత్ర వార పత్రికకి పంపాను. పది వారాలు సీరియల్‌గా వచ్చాయి. తిట్టిన పాఠకులు, మెచ్చుకున్న పాఠకులూ వున్నారు. మునిమాణ్యీకంగారు ఆశీర్వదించారు.


## ఆడుతూ పాడుతూ పని చేస్తూ....

మొదట్లో పాటిబండ పరిమళ పేరే! 1964లో పెళ్లయింది కదా! సో, 1965 నించీ వచ్చిన రచనలకి పరిమళా సోమేశ్వర్ అని వచ్చింది. సోమేశ్వర్‌గారు, నేను పి.యు.సి., బి.యస్సీ కలిసి చదువుకున్నాం. పిజిలో విడిపోయాం. '64లో సిటీ కాలేజి ఉద్యోగ పర్వంలో తటస్థపడ్డాం. ఆయనే ప్రపోజ్ చేశారు. నేను సరేనన్నాను. ఇప్పటికీ ఆ స్నేహం, అభిమానం, అనురాగం అలాగే వున్నాయి. మాకు మనోజ్, కిరణ్ ఇద్దరు అబ్బాయిలు. అమ్మాయి అజంతా, చిరంజీవులు శివ, నిఖిల్, అర్జున్, శ్రేయ, కృష్ణ గ్రాండ్ చిల్డ్రన్. పిల్లలు తెలుగు మాట్లాడతారు. తెలుగు సాహిత్యం లోతులు అర్థం చేసుకోలేరు. మనవలు సరేసరి. అందుకే వాళ్లకోసం నా రచనల్ని నేనే ఇంగ్లీష్‌లోకి అనువదించుకోడానికి శ్రీకారం చుట్టాను. మాది ప్రేమ వివాహం. కులాంతరం అయినా ఖుషీగా, కులాసాగా, ధిలాసాగా సాగుతున్న సంసారం.

## అనూహ్య స్పందన

ఒకసారి రాశాక మళ్లీ పెన్ పెట్టను. మథనం అంతా రాసే ముందే! స్ట్రెయిట్ స్క్రిప్ట్. పది రోజుల్లో ఒక నవల రాసిన రోజులూ ఒక రోజులో ఒక కథ రాసిన రోజులు వున్నాయి. ఒక్క UN PRINTED వాక్యం కూడా లేదు.

రేడియో, దూరదర్శన్‌లలో కూడా నా కాంట్రిబ్యూషన్ వుంది. నా కథల్లోంచి క్రోటన్ మొక్కలతో సహా 13 తీసుకుని 'శ్రద్ధ' శీర్షికన (ఉమన్ ఓరియంటెడ్) ఎస్‌డి లాల్ గారు హిందీలో తనే నిర్మాత, దర్శకుడిగా 13 ఎపిసోడ్స్ తీశారు. అవి నేషనల్ దూరదర్శన్ ఛానల్‌లో ప్రసారమయ్యాయి. అలాగే మన దూరదర్శన్ వారు హాస్య, సందేశాత్మక వగైరా అంశాల్లో పోటీపెట్టారు. ఆ పోటీకి నేను 'పతి జనోద్ధరణ సంఘం' పంపాను. ప్రొడ్యూసర్, రైటర్ నేను. బిందునాయుడు దర్శకురాలు. అదీ 13 ఎపిసోడ్స్. స్పాన్సర్డ్ ప్రోగ్రాం. ప్రేక్షకుల నించి అనూహ్యస్పందన వచ్చింది. క్రోటన్ మొక్కలు తెలుగునించి, ధర్మయుగ్ పత్రికలో హిందీలో వచ్చింది. తర్వాత పంజాబి, మరాఠీ, కన్నడ, తమిళం, మలయాళీ భాషల్లోకి వెళ్లింది. 2008లో పాండిచ్చేరి ఆలిండియా రేడియో వారు తమిళంలో నాటకంగా ప్రసారం చేశారు.



పిల్లలతో ప్రేమయాత్ర

### నచ్చినవి

| | | |
|---|---|---|
| కవి | : | ఆరుద్ర |
| కథకుడు | : | చలం |
| కథ | : | బీనాదేవి కథలన్నీ |
| సినిమా | : | లవకుశ (ఎన్‌టీఆర్, అంజలి) |
| హీరో | : | ఎఎన్నార్ |
| హీరోయిన్ | : | సావిత్రి |
| వంటకం | : | కాజుబర్ఫీ |
| వ్యక్తి | : | అబ్దుల్ కలాం |
| ఫ్రెండ్ | : | అరుణ |
| పాట | : | అన్నమయ్య కీర్తనలు అన్నీ |
| నవల | : | అసమర్థుని జీవయాత్ర, చిల్లర దేవుళ్లు |
| కూర | : | ఆలు ఫ్రై |
| గాయనీగాయకులు | : | సుశీల, ఘంటసాల |

## పెళ్లిళ్లు, ప్రేమయాత్రలు, ప్రభావాలు

రచనని పాఠకులు తీసుకోవడాన్ని బట్టి ప్రభావం వుంటుంది. పాఠకులలో ఆలోచనా శక్తిని, ప్రశ్నించే హక్కుని పెంపొందించడమే నా లక్ష్యం. నా నవల తెల్ల కాకులు '76లో రాశాను. అది చదివి ప్రభావితులై మతాంతర వివాహాలు చేసుకున్న జంటలు నాకు తెలుసు. అలాగే 'పిల్లలతో ప్రేమ యాత్ర' చదివి కొందరు మొదటిసారి హనీమూన్‌కి, కొందరు రెండవసారి హనీమూన్‌కి ప్రేమ యాత్రలు చేసి వచ్చామని ఎంతో మంది చెప్పారు. ఇలాంటివే మరికొన్ని అనుభవాలు, ప్రభావాలు.

## ఏదంటే ఏం చెప్పను!!

ప్రక్రియల్లో కథంటే ఎక్కువ ఇష్టం. ఇజాలు, వాదాలు మాటెలా వున్నా హ్యూమనిజం అన్నది ఒక స్థూలమైన, విశ్వజనీనమైన భావన. హ్యూమనిస్టులు కాని వారెవరూ వుండరు. రచయిత్రిగా, అధ్యాపకురాలిగా ఎటువైపు మొగ్గు అంటే... రచన వల్ల సామాజికంగా హోదా పెరిగింది. రచయిత్రిగా వచ్చిన పేరు ప్రఖ్యాతుల వల్ల లెక్చరర్‌గా గౌరవం పెరిగింది. నా విద్యార్హతలు, ఉద్యోగపు హోదా వల్ల రచయిత్రిగా నాకు గౌరవ హోదాలు లభించాయి అని చెప్పగలను.

## ఫ్లాష్... ఫ్లాష్...

ఈ ఇంటర్వ్యూకి కొసమెరుపు చెప్పనా? మా వారు డా. గెల్లి సోమేశ్వర్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా రిటైరై, ఏడు సంవత్సరాలు హైకోర్టు అడ్వకేట్ చేశారు. ఎవరైనా మీలాంటి జర్నలిస్టులు, రచయితలు నా గురించి అడిగితే ''చదువుకున్న అమ్మాయిల ప్రవర్తన డిఫరెంట్‌గా వుంటుందని భావన. పరిమళ మితభాషి. నా భార్య అంటే ఇలా వుండాలి అని నేనెలా అనుకున్నానో అచ్చం అలాగే వుంది పరిమళ. అందుకేనేమో స్నేహాన్ని ప్రేమగా మార్చిన కెమిస్ట్రీ మా ఇద్దరికీ వివాహం చేసింది'' అంటూ నవ్వేస్తారు.

చాలాకాలం తర్వాత పాఠకులతో ఇలా మాట్లాడే అవకాశం 'నవ్య' కల్పించినందుకు థాంక్స్ చెబుతూ నూర్నేళ్ల తెలుగు కథకు నీరాజనాలు.

**-కె.బి.లక్ష్మి**

నాకు నచ్చిన నా కథ

# క్రోటన్ మొక్కలు

- పరిమళా సోమేశ్వర్



సాయంత్రం ఐదు గంటలయింది. అప్పుడే అలసిపోయి ఇంటికి వచ్చాను యూనివర్శిటీ నుండి. నన్ను చూడగానే 'ఒరేయ్ శీనూ! అక్కయ్యొచ్చిందిరా. పని మనిషిని బాత్‌రూమ్‌లో వేణ్ణీళ్లూ అవీ పెట్టమని చెప్పు' అంటూ కేకేసింది కార్తీక దీపాలకు వత్తులు చేస్తున్న అమ్మ. శీను పరుగెత్తుకు వెళ్లి ఒక్క నిమిషంలో తిరిగి వచ్చాడు.

'నీళ్లు, సబ్బు, టవల్ – అన్నీ రెడీ!' అని చెప్పాడు.

రెండో చెల్లెలు ఊర్మిళ – మూడేళ్లది – 'జోతక్కా, నీ చీరా, జాకెత్తూ నేను పత్తుకుంతాను. ఇతివ్వు' అంటూ బాత్‌రూమ్ వైపుకు వెళ్తున్న నా చేతిలోని బట్టలను లాక్కుంది.

దాని చేతిలోనుండి నేలమీదకు జీరాడుతున్న చీరను చూస్తూనే అమ్మ గద్దించింది. 'ఒసేవ్, రాక్షసిముండా! నీ కెన్నిసార్లు చెప్పాలే! పెద్దక్కయ్య బట్టలు ముట్టుకోవద్దని? కిందపడేసి అలా యీడుస్తుంటే మాసిపోవూ?' అంటూ.

ఊర్మిళ బిక్కమొహం వేసి నిల్చుంది.

దాని చేతిలోనుండి బట్టలు తీసుకుని నేను బాత్‌రూమ్‌లోకి వెళ్లిపోయాను.

నేను స్నానం చేసి వచ్చేసరికి టిఫిన్ ప్లేటులోపెట్టి, పక్కనే మంచినీళ్ల గ్లాసూ, ఒక జగ్గూ, కాఫీ ఫ్లాస్కూ అవీ డైనింగ్ టేబులు మీద రెడీగా అమర్చి ఉంచాడు శీను.

శీను మల్టీపర్పస్ పన్నెండో క్లాసు – ఇంగ్లీషు మీడియంలో – చదువుతున్నాడు. సాధారణంగా ఆ వయసులో ఉన్న మగపిల్లలు యిలాంటి 'సర్వీంగ్'ని అరచి మొత్తుకున్నా చెయ్యరు ఇంట్లో ఎవరికీని. కాని శీను వాడి వయోధర్మాన్ని కూడా అతిక్రమించి చేస్తున్నాడంటే మా యింటి వాతావరణం మహిమ అది! ఆ రకమైన వాతావరణానికి కేంద్రాన్ని నేననుకుంటే జుగుప్సతో కూడిన బాధ కలుగుతుంది నాకు.

మా అమ్మగన్న సంతానంలో నేను పెద్ద దానిని. నా తరువాతిది విజయ. బియస్సీ చదువుతోంది. తరువాత శీను. ఆఖరిది ఊర్మిళ.

నాన్న రిటైర్డు హెడ్ మాస్టారు.

నేను ఎమ్మే, పిహెచ్చిడీ. యూనివర్శిటీలో హిస్టరీ 'రీడర్'గా పని చేస్తున్నాను. నా వయసు ముప్ఫై నాలుగు.

ప్రస్తుతం మా కుటుంబాన్నంతటినీ పోషించేది నేనే. అందుకే ఇంట్లో అంతా నన్ను 'దేవత'లా చూస్తారు.



ఎప్పటిలానే ఆరోజు కూడా అమ్మావాళ్లంతా నాకు చేస్తున్న 'మర్యాదలు' చూస్తుంటే అసహ్యం వేసింది నాకు. ఎవరో వెయ్యి శూలాలు ఒక్కసారిగా నా గుండెలోకి గుచ్చినట్లు విలవిలలాడి' పోయాను.

'అమ్మా! నేను కూడా నీ కూతురినే. వీళ్లందరిలా ఒకప్పుడు నేను కూడా నీ ఒళ్లో పడుకుని, నీ కొంగుపట్టుకుని తిరుగుతూ నీచేత తిట్లుతిన్నదాన్నే. కాని ఈరోజు నన్నిలా 'సింహాసనం' మీద కూర్చోపెట్టి గౌరవిస్తావెందుకు? ఎవరో పరాయి వ్యక్తికి చేసినట్లు ఏమిటి నాకీ మర్యాదలు? నాకు కావలసింది నీ ప్రేమమ్మా! ప్రేమ!' అంటూ ఓసారి అమ్మతో చెప్దామనుకుంటాను. కాని ఎన్నిసార్లు ప్రయత్నించినా దుఃఖంతో నా కంఠం పూడుకుపోతుంది. నా కన్నులలో నీరు క్రమ్ముకుంటుంది. ఏదో తెలియని 'ఇన్ఫీరియారిటీ ఫీలింగు' నన్నావరిస్తుందా సమయంలో.

ఫలహారం, కాఫీ ముగించుకుని ఇవతలకు వచ్చాను. ఆ ఇంట్లో నేను ఒంటరి దానిని. నాతో ఎవరూ చనువుగా మాట్లాడరు. ఆఖరికి నాన్నకి కూడా నేనంటే భయమే. ఇంత వయసొచ్చినా నాకింకా పెళ్లి చెయ్యలేదనీ, ఇకముందు కూడా చెయ్యలేననీ, సాహసించి యెవడైనా నన్ను పెళ్లి చేసుకున్నా ఆ పైన సంసారాన్ని యీదే నాథుడెవరనీ – ఇదీ ఆయన బాధ. దానికితోడు అన్యాయంగా ఒక ఆడపిల్ల జీవితం నాశనం చేశానన్న 'గిల్టీకాంషన్స్'. దాంతో ఆయన నావంక కన్నెత్తి చూడటానికి కూడా సిగ్గుపడతారు.

రోజూలానే నాన్నగారికి గదిలోకి వెళ్లి ఆయన ఆరోగ్యాన్ని గురించి పరామర్శించాను. అదేం చిత్రమో. నేను ఆయన గదిలోకి ఎప్పుడు వెళ్లినా ఆయన చేతిలో ఏదో ఒక పుస్తకమో పేపరో తప్పనిసరిగా ఉంటుంది. ఆయనదంతగా చదివే స్వభావం కూడా కాదు. కాని నేను రోజూ ఆయన దగ్గరకు వెళ్లే సమయం తెలుసు కనుక సూటిగా నా వంక చూడటం తప్పించు కుందామనే ఉద్దేశ్యంతో చేతిలో ఏదో ఒకటి పట్టుకుంటారు.

ఆ సంగతి నాకు తెలుసు. నాకు తెలుసునని ఆయనకి తెలుసు. అందుకే జుగుప్సాకరమైన ఆ నాటకాంకానికి త్వరగా స్వస్తిచెప్పి ఇవతలపడ్డాను.

తరువాత తోటలోకి వెళ్లాను. నాతో ఈ ఇంట్లో స్నేహపూర్వకంగా మాట్లాడేది ఈ పూలమొక్కలే!

తోటలో ఉన్న ఓ చిన్నరాతి గట్టుమీద కూర్చున్నాను. నా కెదురుగా రెండు వైపులా విరగబూచిన రకరకాల పూలు. మధ్యనే సన్ననిబాట. ఆ బాటకిరు వైపులా క్రోటను మొక్కలు అక్కడేకాదు. పూదోటలో చాలా ప్రదేశాల్లో, మట్టికుండీలలో అనేకజాతుల క్రోటను మొక్కలు వివిధ వర్ణాల్లోనూ ఉన్నయ్. విరగబూచిన మందారాలు, ముద్దబంతుల మధ్య ఎంత అందంగా ఉన్నా ఏమిటో ఆ క్రోటన్సు మొక్కలు వెలవెలా బోతున్నయ్.

ఈ మధ్య ఎందుకో ఆ క్రోటను మొక్కలను చూస్తుంటే ఒకరకంగా భయం, జాలీ కూడా కలుగుతున్నయ్ నాకు. నా జీవితానికీ వాటికీ ఏదో అవినాభావ సంబంధముందనీ, నాలో నేను భరించలేని ఏదో దృక్పథం ఆ క్రోటను మొక్కల్లో ప్రతిఫలిస్తోందనీ నా భావన.

అలా శూన్య హృదయంతో ఎంతసేపు కూర్చుండిపోయానో? దశమిచంద్రుడు కొబ్బరి ఆకుల సందుల నుండి మెల్లగా తోటలోకి ప్రవేశిస్తున్నాడు. ఆ వెలుగు కిరణాలు మృదువుగా నా చెంపలను తాకి గిలిగింతలు పెట్టినయ్. ఏదో ఒక విచిత్రమైన కంపనం నా శరీరంలోని అణువణువునూ ఊపివే

# నాకు నచ్చిన నా కథ

## క్రోటన్ మొక్కలు



సంధికాలం (1950-60) లో సామాజికంగా, మేధోప రంగా, పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని ఏర్పర్చుకుని ఎదగడానికి ప్రయత్నిస్తున్న మధ్య తర గతి స్త్రీ కుటుంబపరంగా, వ్యక్తిగతంగా ఎదుర్కొనే సవాళ్లను, కన్నీళ్లను చిత్రించాను. ఈ కథా రచనకు ప్రేరణ 'ఈ కాలం పిల్లల్లో ఏముంది? వీళ్లంతా రంగు రంగుల క్రోటన్ మొక్కలు లాంటి వారు. ఓ పువ్వా? కాయా?' అన్న నా క్లాస్‌మేట్ అరుణ వదిన గారన్న మాటలు. పదిహేనేళ్ల వయసులో విన్న ఆ వాక్యానికి ఇద్దరు పిల్లల తల్లినయ్యాను. నా 26వ ఏట కథా రూపం ఇచ్చాను. జనం మెచ్చారు.

–పరిమళా సోమేశ్వర్

**94907 48091**

యసాగింది.

పగలల్లా యూనివర్శిటీలో విద్యార్థిని విద్యార్థులూ, తోటి ఉపాధ్యాయుల మధ్య గడు పుతూ, నా వ్యక్తిగత విషయాలను, నా తీరని కోరికలను అన్నీ మరచి పోతాను. కాని ఇంటికి వచ్చాక ఇలా ఒంటరిగా కూర్చుంటే ఏవేవో ఆలోచనలు నన్ను ముసురుకుంటయ్. చల్లని సాయంత్రం వేళ ఏకాంతంగా కూర్చుంటే నా మనసు క్రమంగా వశం తప్పిపోతూంటుంది. నా శరీరం ఏవో తీయని అనుభూతుల కోసం అలమటిస్తుంది.

నాలోని 'అలజడి' నేను భరించలేనంత తీవ్రంగా తయారయ్యేసరికి చటుక్కున లేచి లోపలికి వెళ్లాను. నన్ను నేను మరిచి పోదా మనే ఉద్దేశ్యంతో శీనూ, విజయా వాళ్లు చదువు కునే గదిలోకి వెళ్లాను.

విజయంటే నా అంతరాంతరాల్లో ఎందుకో నాకు చచ్చేభయం. అది చాలా పెంకిఘటం. ముక్కుకు సూటిగా పోయేరకం. ఆ గుణాలు నాలో లేక పోవటం వల్లనో ఏమో అదంటే నాకు ఇష్టం లేదు.

అదీకాక మిసమిసలాడే ఇరవైఏళ్ల వయసు దానిది. నిండు యౌవనం తొణికిస లాడే దాని శరీరంలోని వంపులు, పాలమీగడ వంటి దాని బుగ్గలు చూస్తుంటే నా వంటికి కారం పూసుకుంటున్నట్టుగా ఉంటుంది. అది ఎలా చూచినా, ఏ భంగిమలో నిలబడ్డా, ఏ చీర కట్టుకున్నా నా కంటికి అందం గానే కనిపిస్తుంది. అందుకే అదంటే ఒళ్లుమంట నాకు.

నిజానికి ఒక రకంగా విజయకంటె కూడా నేను అందంగానే ఉంటాను. కాని నా అందంలో 'జీవం' లేదు. ఒకరిని ఆకర్షించే శక్తి 'ఇప్పుడు' నాలో లేదు.

అసలు విజయ అందమంతా దాని వయసులోనే ఉంది. కలలు కనే కళ్లు. మిడిసి పడే అవయవాలు, అనుభవాలెరుగని అమాయకత్వం, అనుభూతు లకోసం అర్రులు చాచే ఆ ప్రథమ యౌవనం – అదో చిత్రమైన దశ. ఒక ప్పుడూ నేను కూడా అలాటి 'దశ'లో ఉన్నదానినే.

కాని నా లాగా విజయ జీవితం మోడై పోదు. బీయస్సీ పాసవగానే దానికి పెళ్లి చేసేస్తానంటున్నాడు నాన్న.

నాక్కూడా బియ్యే ప్యాసవగానే నాన్న పెళ్లి చేసేస్తే నే నీ నాడు స్వంత చెల్లెలిని చూసి ఈర్ష్యపడే దౌర్భాగ్యపు స్థితిలో ఉండేదానిని కాను. బి.ఏ. అవ గానే ఎం.ఏ. కావాలన్నాను. మొదటి కూతుర్ను కదా అని ముచ్చటపడి చది వించాడు నాన్న. ఆపైన 'పిహెచ్చిడీ' చేస్తానని పట్టుబట్టాను. తలూపాడు నాన్న. నేను కలలు గన్నట్లుగానే నాలుగేళ్ల తరువాత 'డాక్టర్ జ్యోతిర్మయి' నయ్యాను. అప్పటికి నా వయసు ఇరవై తొమ్మిది దాటింది. నాన్న తొందర పడి సంబంధాలు వెతికితే అప్పటికన్నా అయ్యేదేమో పెళ్ళి. కాని అప్పటికే నాన్న స్థితి శారీరకంగా, ఆర్థికంగా దిగజారిపోయింది. వెంటనే ఉద్యోగం లోకి చేర్పించాడు నన్ను. క్రమంగా మా ఇంటి పరిస్థితులు నా 'జీతం' లేనిదే రోజు వెళ్ళనంతగా పరిణమించినయ్. రక్తమాంసాలను పంచి యిచ్చిన తల్లి దండ్రులలోనే 'స్వార్థం' తలెత్తింది. ఆ స్వార్థం వెనుక ఉన్న ఆవేదన కూడా ఏమంత చిన్నది కాదని నాకు తెలుసు. ఏమైతేనేం, చివరికి బలి అయింది నా జీవితమే.

నేను గదిలోకి వెళ్లేసరికి శీను కుర్చీలో కూర్చుని శ్రద్ధగా చదువుకుంటు న్నాడు. వంచిన తల ఎత్తకుండా, కాస్త పరిశీలనగా చూస్తే ఎవరికైనా తెలిసి పోతుంది. వాడి బుద్ధిమంతుడితనం అంతా వట్టి 'పోజే'నని. వాడి తాపత్రయమంతా నా మెప్పును పొంది 'ఓ ఫైవ్ రుపీస్' సంపాదించి స్నేహితులతో సర్దాగా హోటలుకి, సినిమాకి పోదామనే, నెలకోసారి వాడి కా 'మామూలు' యివ్వటం నా కలవాటే. మొన్ననే ఫస్టు తారీకు.

'ఏరా శీనూ! ఇంగ్లీషు పేపరిచ్చారా?' అనడి గాను.

'ఇచ్చారక్కాయి! నూటికి అరవై మూడు మార్కులు' గర్వంగా సమాధాన మిచ్చాడు.

నేను ఎక్కడ నమ్మనోనని టేబులు మీద రెడీగా పెట్టిన 'ఆన్సర్ పేపరు' తీసి చూపిం చాడు శీను.

వాడు ఎంత కొంటె పిల్లడైనా చదువులో మాత్రం చాలా చురుకు. అందుకే వాడేమడి గినా ఇస్తాను నేను.

ఆ తరువాత విజయవైపు తిరిగినయ్ నా కళ్లు. ఎప్పుడు దాంతో మాట్లాడదామన్నా ఏదో 'ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు' నన్ను వశం చేసు కుంటుంది. అది నావంక సూటిగా చూస్తే సిగ్గుగా, దిగులుగా ఉంటుంది నాకు. నిర్మలంగా ఉన్న దాని కళ్లను చూడ గానే నల్లని వలయాలేర్పడిన నా కళ్లు గుర్తుకు వచ్చి బాధగా ఉంటుంది నాకు. అదీకాక అది నావంక చూసినప్పుడల్లా సగం నెరిసిన నా తల వెంట్రు కలను, బిగువు సడలిపోతున్న నా నిరర్థక శరీరాన్ని, గేలిచేస్తున్నట్లు నా అను మానం. అది వట్టి నా అనుమానం కాదు. నిజం, దాని స్వభావం నాకు తెలి యదు గనకనా!

విజయ మంచం మీద వెల్లకిలా పడుకుని గోడకు నిల్చోబెట్టిన దిండుకు తలానించి నిర్లక్ష్యంగా పాఠ్యపుస్తకంలోని పేజీలను తిరగవేస్తోంది. నేను వచ్చిన సంగతి తెలిసి కూడా అదలా తనకేం పట్టనట్టుండే సరికి నాకు బాధ నిపించింది.

ఐనా గంభీరంగా ముఖం పెట్టి దానిని కూడా పలకరించాను. 'మీ పేపర్లు ఏమిచ్చారే విజయా?'

'ఇవ్వాళ బోటనీ, కెమిస్ట్రీ పేపర్లిచ్చారు'.

'మార్కులెలా వచ్చినయి?'

'బోటనీలో 40%; కెమిస్ట్రీలో 23%'.

'ఏం కెమిస్ట్రీలో తక్కువ మార్కులు వచ్చాయి?'

'పరీక్షల్లో చదవలేదు సరీగా!

'చదవలేదని తెలుస్తూనే ఉంది. ఎందుకు చదువలేదూ అంట?' కాస్త హెచ్చు స్వరంలోనే అన్నా.

చివ్వున లేచి కూర్చుంది విజయ. 'ఎందుకు చదవలేదేమిటి? చదవ బుద్ధి కాలేదు. చదవలేదు. అంతే. అదీకాక కెమిస్ట్రీ అంటే చచ్చే 'బోర్' నాకు. మా లెక్చరర్ చెప్పేపాఠాలు ఆవిడకే సరిగ్గా రావు. బోర్డు మీద ఒక 'యీక్వేషన్' వేసిందంటే దానిని 'బాలెన్సు' చెయ్యటానికి అరగంట తన్నుకుంటుంది మా లెక్చరర్. అదీకాక మాకు కెమిస్ట్రీ థియరీ ఎప్పుడూ సాయంత్రం లాస్ట్ పీరి యడ్ ఉంటుంది. అలసిపోయి ఉండటం వల్ల అందరికీ ఎప్పుడు ఇంటికి వెళ్దామా అనే ఉంటుంది తప్ప పాఠం వినబుద్ధి కాదు'. మార్కులు మంచిగా రాకపోవటానికి తన బాధ్యత ఏమంతలేదని విడమర్చి చెప్పేసింది విజయ.

అది చెప్పిన కారణాలు నిజమే కావచ్చు. కాని అదలా కుండబద్దలు కొట్టి

నట్లు నిజం చెప్పేసరికి నన్నవమానించినట్లు 'ఫీ'లయ్యాను. దాని వయసు ఆడపిల్లకు అంతబలమైన వ్యక్తిత్వం ఉండటం 'శుభ' లక్షణం కాదని నా ఉద్దేశ్యం. మార్కులు తక్కువ వచ్చినా ఎక్కువే వచ్చాయనో, లేదా 'పేప ర్లింకా యివ్వలేదనో అది అబద్ధమాడితే నా కంతకోపం వచ్చేది కాదు.

'చదవటం చేతకాక ఏవో సాకులు చెప్పటం నేర్చుకున్నావ్. అసలు నీకు బుర్ర కుదురుంటేనా చదివేందుకు? ఎంతసేపూ ఆ అమ్మాయేం చీర కట్టు కుందీ, ఏ లెక్చరర్ 'హెయిర్ స్టయిల్' అందంగా ఉందా అనీ, 'నవరంగ్'లో ఏం పిక్చర్ వచ్చిందనీ – ఇవేగా ఉమెన్సు కాలేజీలో మీరు చేసే ఘనకా ర్యాలు! పైగా లెక్చరర్లకే వంకలు పెట్టటం మొదలెట్టావ్?' అని వెంటనే అది ఎక్కడ ఎదురు తిరుగుతుందోనని గబగబ ఇవతలకి వచ్చేశాను.

రాత్రి భోజనాలై నాక రోజులాగానే ఒక ఇంగ్లీషు నవలను చేతిలో పట్టు కుని మంచం మీద వాలాను. కళ్లెం తెగిన గుర్రంలా పరుగులు పెట్టే మన సును అదుపులో పెట్టే ఉద్దేశ్యంతో తీరిక సమయాల్లో సాహిత్య పఠనం చెయ్యటం అలవాటు చేసుకున్నాను. ఐతే నేను చదివే పుస్తకాల్లో కూడా నేను వేటిని మరిచి పోదామని ప్రయత్నిస్తున్నానో ఆ ప్రేమ, వెన్నెలరాత్రులు, సన్నజాజులు, సెక్సూ అన్నీ ఉన్నయ్. కాని వాటిలో నేను పొందే అనుభూతి పరోక్షమైనదవటం వల్ల నన్నంతగా ఊపి పారవేయవు. అదీకాక అనుభవా లెరుగని నేను ఆయా పాత్రలతో తాదాత్మ్యం పొందుతూ ఒక చిత్రమైన సంతృప్తిని పొందుతూంటాను. తెల్లవారింది. ఎప్పటిలానే టూత్‌పేస్టు దగ్గర నుండి అన్నీ శీనూ, ఊర్మిళా అందిస్తూంటే పనులన్నీ ముగించుకుని, భోజనం చేసి తొమ్మిదిన్నరకల్లా యూనివర్శిటీ బస్సుస్టాపులో ఉన్నాను.

అక్కడ నాకు కొంచెం దూరంలో నా దగ్గర చదువుకుంటున్న యూనివ ర్శిటీ విద్యార్థినులిద్దరున్నారు. వాళ్లు నన్ను చూడగానే 'విష్' చేశారు. నా దగ్గరగా వచ్చి నిలబడ్డారు.

నా విద్యార్థులందరికీ నేనొక ఆరాధ్య దేవతని. హిస్టరీలాటి రసహీనమైన సబ్జక్టును కూడా మనసుకి హత్తుకు పోయేటట్లు చెప్తానని మంచి పేరుంది యూనివర్శిటీలో.

నా 'డిగ్నిటీ'ని నిలబెట్టుకునే ఉద్దేశ్యంతో ఎక్కువగా వాళ్లతో సంభాషణని పొడిగించలేదు నేను.

బస్సు వచ్చింది.

అందరూ బిలబిలమంటూ ఎక్కుతున్నారు. మర్యాదకోసం ముందు నన్నెక్కనిచ్చి ఆ తరువాత ఆ విద్యార్థినులిద్దరూ ఎక్కారు. వాళ్లు నా పక్కనే కూర్చుని నాకు వినపడేట్లుగా నిన్న క్లాసులో నేను చెప్పిన పాఠాన్ని గురించి చర్చించుకుంటున్నారు.

బస్సులో చాలామంది యూనివర్శిటీకి సంబంధించినవాళ్ళే. అందులోని ఆడవాళ్లంతా రకరకాలుగా కత్తిరించిన బ్లౌజుల్లో, రంగురంగుల చీరల్లో, వివిధ రకాల 'హెయిర్ స్టయిళ్ళ'లో కన్నుల పండువగా ఉన్నారు. వాళ్ళంద రిలో ఏ కొద్దిమందో తప్ప మిగతా వారంతా పెళ్లి కానివారే. అలాటివారిలో డెబ్భైయయిదు శాతం యికముందు కూడా పెళ్ళికాదని నిశ్చయంగా చెప్ప గల వయసులో ఉన్నారు. ఈ హైదరాబాద్‌లోనే కాదు. భారతదేశంలోని అన్ని నగరాల్లోనూ, పట్టణాల్లోనూ యిలాటి వయసుమీరిన అవివాహితుల సంఖ్య అధికంగానే ఉంది. దీనికి కారణం నేటి విద్యాధికులైన యువకుల్లో నానాటికీ తీవ్రతరమౌతున్న కట్నాల దాహమని కొందరూ, చదువుకుని ఉద్యోగం చేస్తున్న కూతుళ్ళకు పెళ్లిళ్లు చేసేస్తే సంసారాలు గడచేదెలా అని వాపోయే మధ్య తరగతి కుటుంబాల్లోని తల్లిదండ్రుల స్వార్థగుణమని కొందరూ అంటుంటే అసలు శారదా బిల్లు ప్రవేశ పెట్టిన తేదీయే మంచిది కాదనీ, అందువల్లనే మనదేశంలో 'ముదికన్య'ల సంఖ్య క్రమంగా అధికమై పోతోందనీ వాదిస్తాడు ఒక జ్యోతిష శాస్త్ర పారంగతుడు. ఏది యేమైనా ఒక ప్పటి బాలవితంతువుల్లా యిప్పటి వయసుమీరిన అవివాహితలు సంఘంలో హృదయ విదారకమైన 'సమస్య'లై కూర్చున్నారు.


ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట, హైదరాబాద్. 500 073.
ఫోన్స్: 040 - 23747777, 9391999999

FREE online Registration & Free search



www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

అమీర్‌పేట్, కూకట్‌పల్లి, దిల్‌షుఖ్‌నగర్, విజయవాడ, గుంటూరు, తెనాలి, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ, ఖమ్మం, ఒంగోలు
నెల్లూరు, తిరుపతి, కర్నూలు, (చెన్నయ్) టి.నగర్, బెంగుళూర్, సేలం, మధురై, వెల్లూరు, తిరుచి, పాండిచ్చేరి, ఈరోడ్, ఏలూరు

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్. కోయంబత్తూరు.


బయటకు వచ్చినప్పుడు కళకళలాడుతూ చీకూ చింత లేనట్లు కనిపించే వాళ్లందరి గుండెల్లోనూ ఎన్ని విషాదపు లోతులున్నాయో వారిలో ఒక దాన్నైన నాకు బాగా తెలుసు. ఐతే అప్పుడప్పుడు బస్సులో కిటికీలకు దగ్గ రగా కూర్చుని రోడ్డు మీద పోతున్న జంటలను చూడగానే వారి ముఖాల్లోకి చటుక్కున పాకే నీలినీడలు కూడా అరుదైన వేం కావు.

జిలుగువెలుగుల వేషధారణతో తమలో రగిలే అగ్నిపర్వతాలను చల్లా ర్చుకునే యీ కృత్రిమ జీవుల దౌర్భాగ్యానికి జాలిపడేదెవ్వరు?

బస్సులో కూర్చున్నంతసేపూ నాలో రోజూ యివే ఆలోచనలు.

బస్సు ఆర్ట్సు కాలేజీముందు ఆగింది. నా ఆలోచనలు కూడా నిల్చిపోయి నయ్.

మళ్ళీ క్లాసులు, విద్యార్థులు, కొల్లీగ్సు – అదో సందడి.

సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఎన్నడూ లేనిది యిల్లంతా నిశ్శ బ్దంగా ఉంది. ఆ అసహజమైన నిశ్శబ్దతను చూసేసరికి నా గుండెలో దడపు ట్టింది.


నన్ను చూస్తూనే వంటింటి గుమ్మం దగ్గర కూర్చున్న అమ్మ గట్టిగా శోకాలు పెట్టసాగింది. కుర్చీలో కాళ్ళు పెట్టుకుని కూర్చున్న నాన్నగారు వెంటనే లేచి తన గదిలోకి వెళ్ళిపోయారు. ఊర్మిళ బొటనవేలు చీక్కుంటూ కూర్చున్నదల్లా అమ్మ గట్టిగా ఏడవటంతో వేలు తీసేసి బిక్క మొహం వేసింది.

నాకేం అర్థం కాలేదు. 'అమ్మా! ఏమయిందే? ఎందుకేడుస్తావ్?' అన్నాను ఆత్రంగా.

'ఇంకా ఏమవ్వాలే తల్లీ! ఆ పాపిష్టి ముండ కొంప ముంచేసిందేవ్'

కవిత poem

# ఆమె




పసివాడినై ఆమె ఒడి చేరతాను
కళ్ళతో నవ్వుతాను
మనసుతో ఊసులాడతాను
పాటనై పలుకరిస్తాను
పువ్వునై పరిమళిస్తాను
చుట్టూ రంగుల రాట్నంలా పరిభ్రమిస్తాను
సీతాకోక చిలుకనై తన స్నేహ హస్తం అందుకుంటాను
ఆమె శ్వాసల సరిగమలకు మేఘవర్షన్నవుతాను
నా గుండె బరువు దించుకోవడానికి ఒదిగి ఒదిగి
ఆమె గాఢ పరిష్వంగంలో చిక్కుకుంటాను
బహుశా అది చిక్కుకోవడం కాదేమో
ప్రశాంత చిత్తంగా ఆమె నన్ను గెలుచుకోవడం
నా దేహం వశం తప్పి మెత్తటి
ఆమె బాహువులలో బందీ అయిపోవటం
ఆమె స్పర్శ కోసం పరితపిస్తూ
ఆమెలో నా అణువణువు ఐక్యమై పోవటం
కనులు మూసుకొని సుషుప్తిలోకి జారిపోతూ
నా నూతన స్వప్నసౌధాన్ని నిర్మించుకోవడం
ఆమె లాలనలో నా బ్రతుకు బాధల్ని విస్మరించడం
ఆమె మమకార మందిరంలో నా సమస్తాన్ని మరచి
అనురాగశయ్యపై హాయిగా విశ్రమించడం
చిరుచీకటిని చూస్తే ఆమె నవరాగిణి అవుతుంది
వెన్నెల జలతారులంటే మనసు పారేసుకుంటుంది
ఆమె మమకారమూర్తియైన అమ్మకాదు
వేదన పంచుకొని జీవితాన్ని ప్రేరేపించే ధర్మపత్ని కాదు
మానవ దుఃఖాన్ని హరించే మధుర ఔషధం
తన చల్లటి మనసుతో, ఆత్మీయ స్పర్శతో
నిరంతరాయంగా శ్రమించే తేనెటీగల్ని సైతం
నిద్రపుచ్చి రెక్కల భారాన్ని తీర్చే ఇంద్రజాలం
సమస్త జీవరాశికి ఆమె ప్రకృతి ప్రసాదించిన వరం
శిశిరాన్నైనా చిగురింపజేసే కొత్త రుతుపవనం
ఆమె అందరి ఆప్తబంధువు
చీకటి పడగానే పిలవని అతిథిలా భువికి
దివి నుండి దిగివచ్చే అందరి ఆరాధ్య దేవత
ఆమెకు వేయి పడగల ముఖమైనా ఒకటే
శతకోటి వ్యధలతో జ్వలించే మనిషైనా ఒకటే
వెరసి ఆమె ధ్యేయమొక్కటే
రాత్రి అనే గర్భాశయాన్ని నిశ్శబ్దంగా మోసి
రేపు అనే పొత్తిళ్ళలో జీవితాన్ని
చిరునవ్వుతో సరికొత్తగా ప్రారంభింపచేయడం!

-అనపర్తి సీతారామ్
**94931 74741**

అంటూ మళ్లీ రాగాలు తీయసాగింది అమ్మ.

విషయం చెప్పకుండా అలా ఏడుస్తున్న అమ్మని చూస్తుంటే అసలే కంగారుగా ఉన్న నాకు చిరాకేసింది. 'ఒరేయ్ శీనూ' అని పిల్చాను గట్టిగా.

శీను గదిలో నుండి వచ్చాడు తలొంచుకుని.

'ఏం జరిగిందిరా అసలు?' అసహనంగా ప్రశ్నించాను.

'మరే. విజయక్కా....' అంటూ చప్పున ఆపేశాడు అమ్మ వంక బెరుకుగా చూస్తూ.

'ఏమయిందిరా విజయకు? చెప్పి చావూ?' పిచ్చిగా అరిచాను.

'మరే. ప్రకాశరావుగారి రెండో అబ్బాయి వేణుగోపాల్ లేడూ... అతన్ని పెళ్ళి చేసుకుందిట విజయక్క. వాళ్ళిద్దరికీ నెల రోజుల క్రితమే రిజిస్టర్ మారేజి అయిపోయిందట. వేణుకి తిరుపతిలో ఉద్యోగం దొరికింది. అందుకని తిరుపతి వెళ్ళిపోతున్నానంటూ చీటి వ్రాసి వెళ్ళింది విజయ'.

కొంత సేపు స్తబ్దుగా నిల్చుండిపోయాను శీనుమాటలు విని.

నాకు వాడి మాటలు వింటే ఆశ్చర్యం కలగలేదు. ఇలాటిదేదో జరుగుతుందని ముందే తెలుసు నాకు. కాని ఎదురు చూసిన విషయమే అయినా హఠాత్తుగా నా ఊహ నిజమవటంతో నిర్ఘాంత పోవలసి వచ్చింది.

మాట్లాడకుండా నా గదిలోకి వెళ్లాను. స్నానం చేశాను. బట్టలూ అవీ అన్నీ నేను తెచ్చుకున్నాను. వంట ఇంట్లోకి వెళ్ళాను. ఆ రోజు టిఫిన్ చేసిన సూచనలేం లేవు. నేనే స్టౌ వెలిగించి కాఫీ కాచుకుని తాగాను. ఎవరూ నాకు 'సేవలు' చెయ్యనందున నా మనసు హాయిగా ఉంది.

ఇల్లంతా స్తబ్దుగా ఉంది. ఎవరిలోనూ ఉత్సాహం లేదు. నాకు మాత్రం ఎందుకో మనసు తేలికై పోతోంది. ఇన్నాళ్లూ రగుల్తున్న అగ్నిపర్వతం యీ నాడు బ్రద్దలై పోవటం వల్ల నాలో ఒక భయంకరమైన ప్రశాంతి ఏర్పడింది.

ఇకనుండి మిడిసిపడుతూ నా కంట్లో నలకలా ఉంటూ వస్తున్న విజయను చూడనవసరం లేదు. అందుకే నా కఠోరకం తృప్తిగా ఉంది.

నా గదిలోకి వెళ్లాను. బీరువాలోని అద్దం ముందు నిల్చున్నాను. తదేకంగా అద్దంలోకే చూస్తున్న నాకు నా ప్రతిబింబం నవ్వినట్లయి ఉలిక్కి పడ్డాను.

'నువ్వు చెయ్యలేకపోయిన పనిని, నువ్వు చెయ్యాలని తీవ్రంగా వాంఛించిన పనిని విజయ చేసేసింది. అందుకే ఆమె జీవితం సఫలమైంది. నీలో ఆ చొరవ, ధైర్యం, రసపిపాస లేవు. అందుకే నువ్వు 'మోడు'లా అయిపోయావు. నీ జీవితానికింక వసంతం లేదు' అంటూ అద్దంలోని 'జ్యోతి' ఘోషిస్తోంది.

నా ప్రతిబింబాన్ని నేను భరించలేకపోయాను. అక్కడ నుండి కదిలి తోటలోకి వెళ్ళాను... యీసారి నాన్నని పలకరించకుండానే గట్టుమీద కూర్చున్నాను. నా కెదురుగా రెండు వైపులా విరగబూచిన రకరకాల పూలు, మధ్యనే సన్నని బాట. ఆ బాట కిరువైపులా క్రోటను మొక్కలు. రంగురంగుల ఆకులతో ఉన్న ఆ క్రోటను మొక్కలను చూస్తుంటే ఉదయం బస్సులో నేను చూసిన అమ్మాయిలు గుర్తుకు వచ్చారు. విరగబూచిన మందారాలూ, ముద్ద బంతుల మధ్య ఆ క్రోటను మొక్కలు ఎందుకలా వెలావెలా పోతున్నాయో, అర్థమయింది నాకు. చెట్టుకు పూలు, కాయలూ ఎలా అందాన్నిస్తాయో అలాగే స్త్రీకి వివాహం. మాతృత్వం సౌందర్యాన్ని, పరిపూర్ణతని యిస్తయ్. పై పై ఆకర్షణలే తప్ప జీవితంలోని అతి ముఖ్యమైన ఆ ఆనందానుభూతులకు దూరమైన మేమంతా క్రోటను మొక్కల లాటివాళ్ళమే!

మళ్లీ తెల్లవారింది. రోజూలానే బస్సులో యూనివర్శిటీకి పోవటం, తిరిగి రావటం! ఇంటికి వస్తున్నప్పుడల్లా గృహ విషయాల మీదనే నా ఆలోచనలు. 'నాన్నగారి కళ్లజోడు బద్దలయింది. కొనాలి. అమ్మ జాకెట్లు చిరిగిపోయినయ్. నాలుగు గుడ్డలు పట్టించాలి. శీనుగాడి ఎక్స్‌కర్షన్‌కి నలభై రూపాయలు. విజయకి - అన్నట్టు దానికి నేనివ్వలసినదేం లేదు'.

✳